

పీఆర్‌టీయూ కార్యవర్గం ఏర్పాటు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం కరీంనగర్ రూరల్ మండలశాఖ అధ్యక్షుడిగా ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి నియమి తులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బత్తుల అంజయ్యను నియమిస్తూ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధా న కార్యదర్శులు గోనె శ్రీనివాస్, కేతిరి తిరుపతిరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులకు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కోమటి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మండల ఆనందం, రాచమల్ల శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

జమ్మికుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, ఫ్రీబస్సు తప్ప మిగితా ఐదు గ్యారంటీలు అమలు కాలేదన్నారు. జిల్లాలో ధరణి, తాగునీటి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి, ఉద్యోగాలు లేని యువతకు నిరుద్యోగ భృతి కేటాయించాలన్నారు. అర్హులైన పేదలకు నివేశన స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. మతం, కులం పేరుతో బీజేపీ చేస్తున్న విభజన రాజకీయ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. దేశభక్తి పేరుతో దేశంలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారన్నారు. ప్రజల కనీస అవసరాలు, దేశ అభివృద్ధికి ఉపయోగపడే నిర్ణయాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ అధికారంలో వచ్చాక దేశానికి అన్నంపెట్టే రైతులను చిత్రహింసలకు గురి చేస్తుందని, ఢిల్లీలో లక్షలాది మంది రైతులు ఆందోళనలు, పోరాటాలు చేస్తుంటే ఉద్యమాలను అణిచివేస్తూ రైతుల మీద భాష్పవాయువు, రబ్బర్ తూటాలు పేల్చుతూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, కొప్పుల శంకర్, నాయకులు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బియ్యమా? డబ్బులా?

- రేషన్ దుకాణాల్లో అక్రమ దందా
- వేలిముద్ర వేస్తే బియ్యానికి బదులు నగదు చెల్లింపు
- రేషన్ డీలర్లే సూత్రధారులు
- పక్కదారి పడుతున్న పీడీఎస్ బియ్యం







కరీంనగర్ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ సబ్సిడీ బియ్యం పక్కదారి పడుతోంది. రేషన్ డీలర్లే సూత్రధారులుగా ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవలసిన అధికారులు నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడంతో అక్రమ దందా పరిఢవిల్లుతోంది. గతంలో గుట్టుచప్పుడు కాకుండా భయంభయంగా కొనసాగేది. కానీ ఇప్పుడు ఓపెన్ మార్కెట్‌గా మారి పోయింది. చాలా మంది రేషన్ డీలర్లు రేషన్‌కార్డు ఉన్న వారికి ఫోన్‌చేసి వేలిముద్ర వేసి డబ్బులు తీసుకుపోండి అంటూ ఫోన్ చేసి ఆ బియ్యాన్ని ఎక్కువ ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాకుండా జిల్లా కేంద్రం, మండల కేంద్రాలు, పట్టణాల్లో కూడా ఇదే తరహా రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నా యంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పీడీఎస్ ద్వారా దొడ్డు బియ్యంను పంపిణీ చేస్తుండడంతో చాలా మంది వాటిని తీసుకోకపోవడం లేదు, తీసుకున్న వారు కూడా ఆ బియ్యాన్ని ఎక్కువ ధరకు అమ్ముకుంటుండటంతో కొంత మంది డీలర్లు కిలో బియ్యానికి 10 నుంచి 12 చొప్పున ఇచ్చి కార్డులో ఎంత మంది ఉంటే అంత మందికి సంబంధించిన బియ్యాన్ని వారే తీసుకొని డబ్బులు ఇస్తున్నట్లు తెలిసింది. దీనితో వేలిముద్ర వేస్తే చాలు డబ్బులు వస్తాయనే ఆలోచనతో చాలా మంది లబ్ధిదారులు వేలిముద్ర వేసి డబ్బులు తీసుకొని పోతున్నారనే చర్చ జరుగు తోంది. రేషన్‌కార్డు దారులు ఏ డీలర్ల వద్ద నుంచైనా బియ్యం తీసుకునే వెసులుబాటు ఉండడంతో బియ్యం తీసుకొని డబ్బులు ఇచ్చే దుకాణాలకు వెళ్లి వేలిముద్ర వేసి డబ్బులు తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొన్ని చోట్ల డీలర్లే బియ్యం తీసుకుని డబ్బులు ఇస్తుండగా, మరికొన్ని దుకాణాల వద్ద డీలర్ల బినామీలు బియ్యం పంపిణీ చేస్తున్న సమయంలో అక్కడే ఉండి బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి తీసుకొని హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతరులకు కిలోకు 20 చొప్పున విక్రయిస్తున్నారని, దీనితో ఇటు కార్డుదారులు, అటు డీలర్లు, డీలర్ల బినామీలు లబ్ధిపొందుతున్నట్లు తెలిసింది. ఇలా రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రణాళిక ప్రకారంగా రహస్య ప్రాంతా నికి తరలించి వాటిని రైసు మిల్లర్లకు విక్రయిస్తున్నారు. ఆ బియ్యాన్ని సీఎం ఆర్ కింద తిరిగి ప్రభుత్వానికి ఇస్తున్నారని, ఇలా పీడీఎస్ రైస్ పక్కదారి పడుతున్నా అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నారే తప్ప పటిష్ట చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

కొరవడిన నిఘా.. నామమాత్రంగా కేసులు



జిల్లాలో 2,76,908 కార్డులు ఉండగా 8,04,594 యూనిట్లకు ప్రతినెలా 5132.400 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. సరఫరా అవుతున్న బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రతినెలా మండల్ లెవల్ స్టాక్ పాయింట్స్ (ఎంఎల్‌ఎస్) వద్ద నుంచి డీలర్లకు బియ్యం చేరే వరకు అధికా రులు నిఘా పెట్టడం లేదని, దీనితో అక్రమ దందా యథేచ్ఛగా కొనసా గుతుందని విమర్శిస్తున్నారు. మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరు గడంతో కొంత మంది కూలీనాలీ చేసుకునే పేద, అతిపేద కుటుంబాలు వారు కూడా సబ్సిడీ బియ్యాన్ని దళారుల వద్ద నుంచి ఎక్కువ ధరకు కొను గోలు చేస్తున్నారని, మరోవైపు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు కూడా బియ్యాన్ని పంపించి అక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ప్రచారం కూడా ఉంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చేరాల్సిన సబ్సిడీ బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరముందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సన్న వరి ధాన్యానికి క్వింటాల్‌కు 500 బోనస్‌తో ప్రోత్సహిస్తూ, సన్న బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తామని ప్రకటించింది. దొడ్డు బియ్యం పక్కదారి పడుతున్నందున సన్న బియ్యం ఇంకా ఎక్కువ ధరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తారని, సన్నబియ్యం పంపిణీ చేసే సమయానికి అక్రమ దందాను కట్టడి చేసి, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇప్పటికైనా మోక్షం లభించేనా?

- ఆరేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపులు
- మూడేళ్ల క్రితం 4,468 దరఖాస్తులు
- పూర్తయిన ఇళ్లు పంపిణీ చేస్తామంటున్న ప్రభుత్వం

జమ్మికుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి ఇకనైనా మోక్షం లభిస్తుందా అని అర్హులైన నిరుపేద ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. గడిచిన ఆరేళ్ల కాలంలో రెండు సార్లు దరఖాస్తులు స్వీకరించినప్పటికీ, పంపిణీ మాత్రం ముందుకు సాగడం లేదు. మూడేళ్ల క్రితం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. దరఖాస్తుల స్వీకరణ, సర్వేల పేరుతో ప్రభుత్వం హడావిడి చేసింది. మళ్లీ వాయిదా పడింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోంది. ఈ క్రమంలో గతంలో నిర్మించి ఎవరికీ కేటాయించని గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికైనా ఇళ్లు వస్తాయని పేదలు ఎదురు చూస్తున్నారు.

డబుల్ ఇళ్లకు 4వేల 468 దరఖాస్తులు

మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు 2022సంవత్సరం జనవరిలో అధికారులు ప్రకటించారు. జనవరి 9వ తేది వరకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో గడువు తేది 15వరకు పెంచారు. మున్సిపల్ పరిధి నుండి మొత్తం 4వేల 468దరఖాస్తులు వచ్చినట్లు రెవిన్యూ అధికారులు వెల్లడించారు. రెవిన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి మూడు నెలల సమయం వెచ్చించి సర్వేలు చేపట్టారు. వేలాదిగా దరఖాస్తులు రావడంతో పంపిణీ ప్రక్రియ లాటరీ పద్దతి ద్వారా చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఏం జరిగిందో తెలియదు కాని ఇండ్ల పంపిణీ కార్యక్రమం మూలన పడింది.

2018లో అప్పటి తహసీల్దార్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. ఆ సమయంలో 1500 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో నుంచి అర్హుల జాబితా ఎంపిక చేశారు. అర్హుల జాబితాలో అనర్హులు ఉన్నారని, జోరుగా పైరవీలు నడిచాయని, డబ్బులు తీసుకుని జాబితాలో పేర్లు ఎక్కించారని ఆరోపిస్తూ పలువురు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి లబ్ధిదారుల లిస్టును పక్కన పెట్టారు.

జమ్మికుంటకు 500 ఇళ్లు మంజూరు..

జమ్మికుంట మున్సిపల్ పరిదిలో 500డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గత ప్రభుత్వం మజూరు చేసింది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సమీపంలో ఆరేళ్ల క్రితం మాజీ మంత్రి ఈటల రాజేందర్ చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. 20బ్లాక్‌ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కాగా, మరో మూడు బ్లాకుల్లో ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి కావల్సి ఉంది. ఒక్కో బ్లాక్‌కు 12డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల చొప్పున 240ఇండ్లు ఉన్నాయి. మారుతినగర్‌లోని 9బ్లాకుల్లో 108ఇండ్లు బేస్మెంట్, పిల్లర్లు, స్లాబ్ లెవల్లో ఉన్నాయి. ధర్మారం పరిధిలో 152ఇండ్లు పూర్తి అయ్యాయి.

గతంలోని దరఖాస్తుల సంగతేంటి..?

అధికారులు డబుల్ ఇళ్ల పంపిణీ కార్య క్రమం మొదలు పెడితే గతంలో చేసు కున్న దరఖాస్తులు పనిచేస్తాయా, లేక మళ్లీ కొత్త దరఖాస్తులు చేసుకోవాలా అనే సందేహాలు దరఖాస్తు దారుల్లో వ్యక్తం అవుతున్నాయి. గతంలో చేసు కున్న దరఖాస్తులు అలానే మూలన పడటంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రత్యేక చొరువ చూపి డబుల్ ఇండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఆశావాహులు కోరు తున్నారు.



ధర్మారంలో పూర్తి అయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

ఆస్తి పన్ను పెంచారు.. అభివృద్ధి మరిచారు

- కార్పొరేషన్ విలీన కాలనీల్లో ప్రజల ఇబ్బందులు
- అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు లేక అవస్థలు



చినుకు పడితే చిత్తడిగా మారుతున్న అలుగునూర్ శివారు కాలనీలో రోడ్డు(ఫైల్)

తిమ్మాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లో విలీనం అనంతరం ఆస్తి పన్నులను అమాంతం పెంచేసిన పాలకులు కార్పొరేషన్ శివారు కాలనీల్లో అభివృద్ధి వైపు కన్నెత్తి చూడటం లేదు. శివారు కాలనీల్లో చాలా చోట్ల ఇప్పటికీ డ్రైనేజీలు, అంతర్గాత రోడ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. తిమ్మాపూర్ మండలంలో ఉన్న అలుగునూర్ గ్రామ పంచాయతీని కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. అలుగునూర్ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఉన్న ఇంటి పన్ను కార్పొరేషన్‌లో విలీనం అయిన తరువాత వంద శాతం పెరిగింది. అలుగునూర్ శివారులోని మానేరునగర్‌లో నివాసం ఉంటున్న ఓ రిటైర్డ్ ఉద్యోగి తన ఇంటికి గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో సంవత్సరానికి కేవలం 700రూపాయల ఇంటి పన్ను చెల్లించే వారు. కార్పొరేషన్‌లో విలీనం తరువాత ప్రస్తుతం సంవత్సరానికి 11,300 రూపాయల ఇంటి పన్ను చెల్లిస్తున్నాడు. 30రూపాయలు ఉన్న నల్లా బిల్లు 1800 రూపాయలకు పెరిగింది. విలీనం సమ యంలో విలీనం వద్దని, విలీనం చేస్తే పన్నుల భారం పడుతుందని ప్రజలు వ్యతిరేకిం చారు. మూడేళ్లలో అభివృద్ధి చేస్తామని, అప్పటి వరకు గ్రామ పంచాయతీ పన్నులనే కట్టాలని హామీ ఇవ్వడంతో ప్రజలు విలీనానికి అంగీకరించారు. దాదాపు ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అభివృద్ధి చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్‌కు అనుకొని ఉన్న 8వ డివిజన్ అలుగునూర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి.

ప్రజల ఫిర్యాదులు

ఆస్తి పన్నులు తగ్గించాలని, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, అలుగునూర్ ప్రజలు గతం నుంచి నగరపాలక సంస్థతో పాటు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేస్తున్నా ఇక్కడి సమస్యలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భువన్ యాప్‌తో పెరుగుతున్న ఆస్తి పన్ను

భువన్ యాప్ ద్వారా ప్రతి ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి ఆస్తి పన్నులను వసూలు చేస్తున్నారు. ఇంటి నిర్మాణం కొలతలతో పాటుగా ఖాళీ స్థలాన్ని కూడా పరిగణలోకి తీసుకొని ఆస్తి పన్నులను లెక్కిస్తున్నారు. ఈ కారణంగా కార్పొరేషన్‌లో విలీన గ్రామ పంచాయతీలలో ఆస్తిపన్ను గతంలో పోలిస్తే సుమారు నాలుగు రెట్లకు పైగానే పెరిగింది. దీంతో ఒకేసారి ప్రజలపై ఆస్తి పన్నుభారం పడింది. ప్రభుత్వం ఇకనైనా తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



డ్రైనేజీ లేక రోడ్లపైనే ప్రవహిస్తున్న మురికి నీరు(ఫైల్)



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



చెత్తచెదారంతో నిండిన ప్రయాణ ప్రాంగణం అవరణ

అస్తవ్యస్తంగా ప్రయాణ ప్రాంగణం

- దుర్వాసనతో ప్రయాణికుల ఇక్కట్లు
- తాగునీటి ఆర్‌వో పరిసరాల్లో చెత్తాచెదారం
- కుక్కల బెడదతో ఇబ్బందులు

- భగత్‌నగర్, ఆంధ్రజ్యోతి 7

ఇంటి పంటతో ఆరోగ్యం

- కరీంనగర్ టౌన్, ఆంధ్రజ్యోతి 8

మాజీ సర్పంచుల పోరుబాట

- నేటి నుంచి కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు
- పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి
- తాజామాజీ సర్పంచుల జేఏసీ పిలుపు



కరీంనగర్ టౌన్/సుభాష్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల కోసం తాజామాజీ గ్రామసర్పంచులు పోరుబాటపట్టారు. దాదాపు ఏడాది నుంచి బిల్లుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వివిధ కార్యక్రమాలను చేపట్టిన తాజా మాజీ సర్పంచుల జేఏసీ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సోమవారం నుంచి ఐదు రోజులపాటు అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట విభిన్న రూపాల్లో నిరసన, ధర్నా కార్యక్రమాలను, దీక్షలను చేపట్టాలని పిలుపునిచ్చింది. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే నిరసన దీక్షలు చేపట్టాలని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే దశలవారీగా పోరాటాలను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత బీఆర్‌ఎస్ సర్కార్ అభివృద్ధి పనులు చేయండి బిల్లులు ఇస్తామని చెప్పడంతో చాలా మంది సర్పంచులు వారివారి గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. జిల్లాలోని 313 గ్రామపంచాయితీల్లోని తాజా మాజీ సర్పంచుల్లో చాలా మంది అప్పులు చేసి గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. అలాంటి వారు అప్పు తెచ్చిన వాటికి వడ్డీ చెల్లించలేక పోతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఆందోళన చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరసన దీక్షలకు సమాయత్తమయ్యారు. సోమవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట తలపెట్టిన దీక్షలకు జిల్లాలోని తాజా మాజీ సర్పంచ్‌లు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తాజామాజీ సర్పంచ్‌ల జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం కోరారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు బాకీలు తెచ్చి, ఎస్టెలు అమ్మి పనులు చేయించామన్నారు. బిల్లులు చెల్లిస్తామని తెలుపగానే సర్పంచ్‌లందరూ తెలిసిన వారి వద్ద బాకీలు తీసుకువచ్చి పనులు చేయించారని, లక్షల కొద్ది బిల్లులు పెండింగ్‌లో ఉండి వడ్డీలు కట్టలేక పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. ఆత్మహత్యలే శరణ్యంగా మారిందని ఆవేదన చెందారు. ప్రభుత్వానికి పలుమార్లు వినతులు చేసినా స్పందన లేకపోవడంతో నిరసన దీక్షలు చేపట్టినట్టు తెలిపారు. సోమవారం నుంచి ఈనెల 14 వరకు వివిధ రూపాల్లో దీక్షలు కలెక్టరేట్ వద్ద చేపడతామని, దీక్షలకు సర్పంచ్ లందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రుణ మాఫీలో కేంద్రం బాధ్యతలను విస్మరించడం తగదు

- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణ మాఫీ వ్యవహారంలో కేవలం రాష్ట్రానికే బాధ్యత ఉంటుందా.. కేంద్రానికి బాధ్యత లేదా అని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో రుణ మాఫీ వ్యవహారం లో కేంద్రమే బాధ్యత తీసుకుందని గుర్తు చేశారు. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం రైతు రుణ మాఫీ బాధ్యతను విస్మరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రుణ మాఫీలో కేంద్రం తనవంతు పాత్రను పోషించాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కోరుతున్నానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో రాచరిక వ్యవస్థకు అద్దం పట్టేలా రూపొందించారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బి డ్డను పోలి ఉండేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారని వివరించారు. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న అనవసర విమర్శలు మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ సర్కారు అన్ని నియోజకవర్గాలలో రెసిడెన్షియల్ స్కూళ్ల లో సొంత భవనాలు కట్టించే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు దుర్గయ్య, నక్క జీవన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.

- సీఎంకు జీవన్‌రెడ్డి లేఖ..

తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేయనున్న 16 కృషి విజ్ఞాన కేంద్రాలలో భాగంగా జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జీవన్ రెడ్డి ఆదివారం లేఖ రాశారు. కృషి విజ్ఞా న కేంద్రం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన యూనివర్సిటీ ఆధ్వర్యం లోని శాస్త్రవేత్తల బృందం జగిత్యాలలో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసినట్లు తెలిసిందన్నారు. జగిత్యాల పట్టణ శివారులోని చల్‌గల్‌లో గల వాలంతరీకి చెందిన భూమి సుమారు 50 ఎకరాలు అందుబాటులో ఉందని, కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నీరుకుల్ల వంతెనకు

మోక్షమెప్పుడో?

- నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నీరుకుల్లలో మానేరు వాగుపై నిర్మించిన వంతెన

సుల్తానాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : లక్షల రూపాయల ఖర్చు చేసి నిర్మించిన వంతెనకు మోక్షం కలగడం లేదు. సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్ల మానేరు వాగుపై వంతెన నిర్మాణం పూర్తయి ఆరేళ్లు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రజల రవాణా సౌకర్యం మెరుగుపడుతుందనుకున్న వారి ఆశలన్నీ అడియాశలవుతున్నాయి. వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడం వలన వాహనాల రాకపోకలకు వీలు పడడం లేదు. వంతెన నుంచి కుడి వైపు వెళ్లినా, ఎడమ వైపు వెళ్లినా మధ్యలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలు వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారాయి. దీంతో వంతెన ఎప్పుడు ప్రారంభవుతుందా అని ఆశతో ఎదురు చూస్తున్నారు.



వంతెనకు కుడి వైపు భారీ వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న కోమాండ్లపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి

● కొలిక్కిరాని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

వంతెనను ఉపయోగంలోకి తేవడంలో పలు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఓవైపు అప్రోచ్ రోడ్డు లేకపోవం, మరోవైపు రెండు వైపులా రైల్వే అండర్ బ్రిడ్జిలు అడ్డుగా ఉన్నాయి. వంతెన నుంచి కుడి, ఎడమ వైపు ఉన్న లోలెవల్ రైల్వే అండర్ బ్రిడ్జిల స్థానంలో హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉంది. లేదా ప్రస్తుత వంతెన నుంచి రైలు మార్గంపై నుంచి నీరుకుళ్ల-గర్రెపల్లి రోడ్డుపై వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం అయినా చేపట్టాల్సి ఉంటుంది. ఈ ఫ్లైఓవర్ నిర్మించడానికి ప్రస్తుత వంతెనను ఇంకా ముందుకు కొనసాగించేందుకు హైటెన్షన్ విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నాయి. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ఆరేళ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అవి కొలిక్కి రావడంలేదు. వంతెన నుంచి రంగంపల్లి పెద్దమ్మ దేవాలయం వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం రూ.27 కోట్లతో అంచనాలు తయారుచేసినా ప్రధానంగా భూసేకరణ సమస్య పరిష్కారం కావడం లేదని తెలిసింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● వంతెనకు ప్రతిపాదనలు..

సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల మానేరు వాగుపై వంతన నిర్మాణ ఆవశ్యకతను, ప్రయాణ వెసులుబాటును, తగ్గే దూర భారం తదితర అంశాలను పరిగణనలోకి తీసు కొని ఆనాటి ఎమ్మెల్యేలు ప్రతిపా దనలు సిద్ధం చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి హయాంలో నాటి రోడ్లు, భవనాల శాఖ మంత్రి జీవన్‌రెడ్డికి సుల్తానా బాద్‌లో మినీ కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే గీట్ల ముకుంద రెడ్డి వంతెన అవశ్యకతపై విజ్ఞప్తి చేశారు. నిధులు మంజూ రైనా కానీ సకాలంలో పనులు చేపట్టకపోవడంతో వంతెన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ ఏర్పడ్డాక 2015లో సీఎం కేసీఆర్‌కు ఆనాటి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వంతెన నిర్మాణం గుర్తించి వినతి పత్రాన్ని సమర్పించారు. స్పందించిన సీఎం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

● తగ్గనున్న దూర భారం..

సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్ల వద్ద మానేరుపై వంతెనపై రాకపోకలు ప్రారంభమైతే ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రయాణీకులకు ఎంతో వెసులుబాటు కలగడంతో పాటు దూరభారం కూడా తగ్గనుంది. సుల్తానాబాద్ మండలం నీరకుల్ల మానకొండూరు మండలం వేగురపల్లి నుంచి నిత్యం ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన మీదుగా వెళితే తమకు 30-35 కిలోమీటర్ల దూరభారం తుగ్గుతుందని, వంతెన పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

● 2016లో శంకుస్థాపన..

తెలంగాణ ప్రభుత్వంలో అప్పటి మంత్రులు ఈటల రాజేందర్, హరీష్‌రావు తదితరులతో పాటు పలువురు ఎమ్మెల్యేల సమక్షంలో 12 జనవరి 2016న నీరుకుళ్ల వంతెన నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. రెండేళ్లలోనే పనులు పూర్తిచేయించారు. తర్వాత రాకపోకలు సవ్యంగా సాగుతాయని అందరూ ఆశించారు. కానీ వంతెన నుంచి ఎడమ వైపు వెళితే కోమాండ్లపల్లి రోడ్డులో ఒక రైల్వే అండర్ బ్రిడ్జి, కుడి వైపు వెళితే నీరుకుళ్ల గ్రామం వద్ద మరో రైల్వే అండర్ బ్రిడ్జి ఉంది. ఈ మార్గంలో ఉన్న రెండు రైల్వే అండర్ బ్రిడ్జిలు చిన్నగా ఉండడంతో వాటి కింది నుంచి భారీ వాహనాలు లేని పరిస్థితి. దాంతో మానేరుపై నిర్మించిన వంతెన వల్ల ఉపయోగం లేకుండా పోతోంది. అధికారుల రైల్వే అండర్ బ్రిడ్జిలను పరిగణనలోకి తీసుకొని తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఉంటే వంతెన ఉపయోగంలోకి వచ్చి ఉండేది.

టీ-ఫైబర్ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు

- ఇంటి నుంచే 150 రకాల పౌర సేవలందించేందుకు మీ సేవ యాప్ సిద్ధం - పైలట్ ప్రాజెక్టు కింద 3 గ్రామాల్లో సేవలు ప్రారంభం
- హైదరాబాద్‌లో యాప్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ముత్తారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సేవలను టీ ఫైబర్ ద్వారా అందించేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హైదరాబాద్‌లో టీ-ఫైబర్ యాప్ ను పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామ పంచాయతీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో రాష్ట్రంలో 7592కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆజాద్ ఇంజనీరింగ్, ప్రీమియర్ ఎనర్జీస్, గ్లోబల్ ఎన్విరాన్ మెంట్, లెన్స్‌కార్ట్ సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రజలకు అందించే టీ-ఫైబర్ యాప్ ద్వారా టెలిఫోన్, ఇంటర్నెట్, కేబుల్ టీవీ, కంప్యూటర్ వంటి అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని, వీటిని వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యా ప్తంగా ముందస్తుగా 3పైలెట్ గ్రామాలను ఎంపిక చేసి టీ-ఫైబర్ యాప్, ఇం టింటికీ ఇంటర్నెట్ కనెక్షన్స్ సౌకర్యాలు కల్పించామన్నారు. ఇందులో నుంచి వచ్చే అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలు విస్తరి స్తామని అన్నారు. టీ-ఫైబర్ ప్రాజెక్టు ద్వారా మొదటి సంవత్సరం ప్రభుత్వ కార్యాలయాల కు బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ అందిస్తామని అన్నారు. మీ సేవా ద్వారా 150 రకాల పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా మొబైల్ యాప్ సిద్ధం చేయడంతో పాటు రద్దీ ప్రాంతాల్లో క్యూఎస్కేలను ఏర్పాటు చేయనుందని అన్నారు. షాపింగ్‌మాల్స్, మెట్రో స్టేషన్లు, కలెక్టరేట్లు, ఇతర ప్రాంతాలు ఇంటరాక్టివ్ క్యూఎస్కే ద్వారా ప్రజలు పౌర సేవలు పొందవచ్చని, దరఖాస్తు నింపడం చెల్లింపులు చేయడం సర్టిఫికెట్ ప్రింట్ తీసుకునే అవకాశాలు కల్పిస్తామన్నారు. మీ సేవలో ప్రభు త్వం కొత్త సర్వీసులు చేర్చిందని, పర్యాటక శాఖ హోటల్స్, పర్యాటక ప్యాకేజీల బుకింగ్, దివ్యాంగుల గుర్తింపు కార్డులు, వయోవృద్ధుల సంక్షేమ కేసుల పర్యవేక్షణ సర్టిఫికెట్ల జారీ, అటవీశాఖకు సంబంధించి వన్యప్రాణుల బాధితులకు సహాయం, కొత్తవి జారీ, వాల్టా చట్టం కింద చెట్ల తొలగింపు, తరలించేందుకు అనుమతులు వంటి సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు.ప్రజలకు ఇబ్బదులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మా ట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద అడవిశ్రీరాంపూర్ గ్రామాన్ని ఎంపిక చేసి ప్రతి ఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్, టెలిఫోన్ కనెక్షన్ అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో డీపీవో వీర బుచ్చయ్య, జడ్పీ సీఈవో నరేం దర్, మంథని ఆర్డీవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేలోతు తండాలో చిరుత సంచారం



రైతులు గుర్తించిన చిరుత అడుగులు

వీర్నపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కేలోత్ తండాలో ధరం గుండు చెక్ డ్యాం ప్రాంతంలో చిరుత పులి గిరిజన రైతులకు కనిపించింది. శనివారం కేలోత్ తండాకు చెందిన రైతులు వ్యవసాయ పనులకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో దూరంగా ఉన్న పొలం గట్లపైన చిరుత పులి కనిపించడంతో గిరిజన రైతులు భయభ్రాంతులకు గురై ఇంటికి పరుగులు తీశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు సమాచారం అందించినట్టు రైతులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పోలీస్‌లు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలి స్తుండడంతో తనిఖీ చేసి వేణు, కుమార స్వామిల పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- నానమ్మ మృతి చెందిన మూడు రోజులకే మనుమడు మృతి
- మూడు రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో ఇద్దరు మృత్యువాత



రాజమొగిలి(ఫైల్)

వెల్గటూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట గ్రామంలో ఒకే కుటుంబంలో మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి చెందారు. నానమ్మ మృతి చెందిన మూడు రోజులకే మనుమడు మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిట్టల రాజమొగిలి (37) నానమ్మ పిట్టల భూమక్క మూడు రోజుల క్రితం మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఆమెకు ఆదివారం మూడు రోజుల కార్యక్రమం చేయడానికి కిషన్‌రావుపేట శివారులోని శ్మశాన వాటిక వద్దకు వెళ్లారు. అక్కడ కార్యక్రమం అనంతరం వ్యవసాయ బావి వద్ద స్నానాలు చేస్తుండగా రాజమొగిలి తమ్ముడు మల్లేష్, కొడుకు రిశ్వంత్ (13)కు కరెంట్ పైపు నుంచి విద్యుత్ షాక్ తగలడంతో అది చూసిన రాజమొగిలి వెళ్లి వారిని పక్కకు లాగాడు. ఈ క్రమంలో రాజమొగిలి విద్యుదా ఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. వెంటనే రాజమొగిలిని స్థానికులు కరీంనగర్ ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రాజమొగిలి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మల్లేష్, రిశ్వంత్‌లు ప్రాణాలతో బయటపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. రాజమొగిలి భార్య పిట్టల సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. మృతుడు రాజమొగిలి ఇటీవలే అప్పు చేసి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



షమీమ్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ షమీమ్ (46) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక ఆదివారం సిరిసిల్ల మానేరు వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. షమీమ్ కుటుంబ పోషణ నిమిత్తం టైలరింగ్ నిర్వహించుకునే వాడు. ఇటీవల తన కుమార్తె వివాహం చేయగా చిన్న కూతురు వివాహం అప్పుల బాధతో ఎలా చేయాలో తోచక మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృత్యువాత



మూగజీవాలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు, నాయకులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన ముడావత్ భీంరావు అనే మేకల కాపరికి చెందిన మూడు జీవాలు, రెండు శునకాలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. మేకల కాపరి భీంరావును కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. వివరాల్లోకి వెళ్తే భీంరావు ఇంటి పక్కన విద్యుత్ స్తంభానికి ఆనుకుని గొర్రెల షెడ్డును నిర్మించాడు. షెడ్డు చుట్టూ ఇనుప జాలీని ఏర్పాటు చేయగా అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం సింగిల్‌ఫేజ్ 25కెవి డీటీఆర్‌కు ఇనుప జాలీ ఆనడంతో విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో పాకలో ఉన్న మూగజీవాలు, రెండు శునకాలు జాలికి తాకడంతో అక్కడికక్కడే శుక్రవారం మృతి చెందాయి. 80 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న సెస్ ఏఈ పృథ్వీ, లైన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాపరి ఆందోళన చెందవద్దని, సెస్ ద్వారా నష్టపరిహారం అందేలా చూస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. వారి వెంట పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీడీవో మృతి

బుగ్గారం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మాడిశెట్టి శ్రీనివాస్(52) శనివారం రాత్రి కరీంనగర్ లోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఫిబ్రవరిలో జరిగిన బదిలీల్లో ఆయన బుగ్గారం ఎంపీడీవో గా బదిలీ అయ్యారు. విధి నిర్వహణలో నిన్న సాయంత్రం వరకు జగిత్యాలలో తోటి అధికారులతో తన సిబ్బందితో గడిపిన ఆయన గుండెపోటుతో మృతి చెందడంతో తోటి ఉద్యోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం మండల అధ్యక్షుడు వేముల సుభాష్‌తో పాటు బుగ్గారం కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవో అంత్యక్రియలో పాల్గొని సానుభూతి తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాసుగంటి హను మంతరావు కోరారు. ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లుల సత్వర పరిష్కారం కోసం డిసెంబరు 17న టీపీయూఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ధర్మదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ డీఏలు, పీ ఆర్‌సీ నివేదికను తెప్పించుకుని అమలు చేయాలన్నారు. జీవో 317 ద్వారా నష్టపోయిన ప్రతీ ఉద్యోగికి న్యాయం చేయాలన్నారు. సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేసి వారికి పోస్టింగ్ ఆర్డర్లు వారి స్థానికత ఆధారంగా ఇవ్వాలన్నారు. సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలన్నారు. సమావేశంలో టీపీయూఎస్ రాష్ట్ర కార్య దర్శి రొట్టె శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బండి మహేష్, జిల్లా కార్యదర్శి కాశెట్టి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శీలం రాజేష్, మండల అధ్యక్షులు కాశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కనపర్తి సంతోష్, మండల బాధ్యులు గడిపెల్లి కిరణ్ పాల్గొన్నారు.

నారు మడిలో సస్య రక్షణ

● వరి సాగులో నారు పెంపకం కీలకం

ఇల్లందకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో నారుమడి కీలకం. నారు బాగుంటే అధిక దిగుబడి సాధించవచ్చు. ఈ ఏడాది వర్షాకాలంలో సమృద్ధిగా కురిసిన వర్షాలతో చెరువులు, డ్యామ్‌లు నిండుకుండలా ఉన్నాయి. ప్రస్తుత యాసంగికి పంట వేసేందుకు రైతులు నారుమడులు సిద్ధం చేసి విత్తనాలు అలికారు. డిసెంబరు 15 వరకు నారుమడులు పోసినట్లయితే అధిక దిగుబడి రావడానికి అవకాశాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు.

● నారుమడి పెంపకం..

నారుమడిని బాగాదున్ని రెండుమూడు సార్లు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసి నారు మళ్లను తయారు చేయాలి. రెండు గుంటల నారుమడికి 2కేజీల నత్రజని, 1కేజీ భాస్వరం, 1కేజీ పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. పశువుల పేడను, ఇతర సేంద్రీయ ఎరువులను దుక్కిలో వేయడం చాలా మంచిది. మొలక కట్టిన విత్తనాన్ని చల్లి, మొదట్లో ఆరుతడులు ఇచ్చి, తర్వాత మొక్క దశలో పలుచగా రెండు మూడు సెంటీమీటర్ల వరకు నీరు ఉంచాలి. జింక్ లోపం సవరణకు లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి. మెట్ట నారుమడిలో ఇనుప ధాతు గమనిస్తూ సరి చేయాలి. నారుమడి పీకే వారం రోజుల ముందు ఒక గుంట నారుమడికి 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకతో కలిపి చల్లి పలుచగా నీరుంచాలి. అవసరాన్ని బట్టి మడిలో ఇతర సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.



ఇల్లందకుంటలో పోసిన నారుమడి

● ప్రధాన పొలం తయారీ, మొక్కల సాంద్రత...

నాట్లు వేయడానికి 15రోజుల ముందుగానే పొలాన్ని దమ్ము చేయుట ప్రారంభించి రెండు మూడు దఫాలుగా మురగ దమ్ము చేయాలి. నాలుగు నుంచి ఐదు ఆకులున్న నారును నాటుకోవాలి. కొద్దీగా చౌడున్న పొలాల్లో లేత నారు వేయవద్దు. ముట్ట ముదురాలి, భూసారాన్ని రకాన్ని బట్టి, కాలాన్ని బట్టి చదరపు మీటర్‌కు కుదుళ్ల సంఖ్య మారుతుంది. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల బాటలు తీయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి అదుపులోకి వస్తుంది. నారు బాగా ముదిరి ఆలస్యంగా నాటినప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురుకు 6-8 మొక్కల చొప్పున నాటు వేయాలి. అలా ముదురు నారు నాటినప్పుడు నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25శాతం పెంచి మూడు దఫాలుగా కాకుండా రెండు దఫాలుగా అంటే 70శాతం నాటే సమయంలో మిగతా 30 శాతం అంకురం దశలో వేయాలి.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

- ముప్పిడి సూర్యనారాయణ, మండల వ్యవసాయాధికారి, ఇల్లందకుంట



రైతులు వరినారు విత్తనాల ఎంపికలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. విత్తన ఎంపికలో మోసపోకుండా దిగుబడి ఎక్కువగా వచ్చే విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. నారుమళ్లు పోసుకోవడానికి డిసెంబరు 15 వరకు అవకాశం ఉంది.



కరీంనగర్ బస్టాండ్ వద్ద మురుగునీటితో నిండిన డ్రైనేజీలు



చెత్తాచెదారంతో నిండిన ప్రయాణ ప్రాంగణం ఆవరణ

అస్తవ్యస్తంగా ప్రయాణ ప్రాంగణం

- దుర్వాసనతో ప్రయాణికుల ఇక్కట్లు
- తాగునీటి ఆర్‌వో పరిసరాల్లో అపరిశుభ్రత
- కుక్కల బెడదతో ఇబ్బందులు

భగత్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రయాణ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. నిత్యం కరీంనగర్ నుంచి హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ, గుంటూరుతో పాటు వివిధ ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తుంటారు. కరీంనగర్ బస్టాండ్‌లో మురుగు కాలువలు తీయక పోవడంతో దుర్వాసన వస్తోంది. బస్టాండ్‌లోని హోటల్స్, షాపులు, లాడ్జిల నుంచి వ్యర్థ పదార్థాలు డ్రైనేజీల్లోకి వదులుతుండడంతో భరించలేని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రయాణికులు తెచ్చుకున్న వాటర్ బాటిల్స్, తినుబండా రాల ప్యాకెట్లు, కవర్లు ప్లాట్ ఫాంలపై పడవేస్తున్నారు. బస్టాండ్‌ను ప్రతి రోజూ శుభ్రపరిచే శానిటేషన్ సిబ్బంది లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. మంచినీటి ఆర్‌వోల పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం నిండి ఉండడంతో ప్రయాణికులు తాగేందుకు జంకుతున్నారు.



బస్సులు బయటికి వెళ్లే మార్గం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు

● ట్రాఫిక్ అస్తవ్యస్తం

కరీంనగర్ ప్రయాణ ప్రాంగణం ముఖ ద్వారంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. కార్లు, ద్విచక్ర వాహనాలు బస్టాండ్ లోకి వస్తుండడంతో బస్సులు ఎక్కేందుకు వెళ్తున్న ప్రయాణికులతో పాటు, దిగి వెళ్తున్న ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. బస్టాండ్ ప్లాట్ ఫాంలపైనే పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతుండడంతో ప్రయాణికులు భయభ్రాం తులకు లోనవుతున్నారు. ప్లాట్‌ఫాంల వద్ద ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీల కింద నిత్యం కుక్కలు పడుకుంటుండడంతో కూర్చునే పరిస్థితి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణ ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక



ఇల్లంతకుంట విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్

ఇల్లంతకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిద పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు ఎంపికయ్యారు. గాలిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అమిత అనే విద్యార్థిని గైడ్ టీచర్ యాద రవి సహకారంతో ఫోల్డేబుల్ చైర్ రూపొందించి పలువురి ప్రశంసలు అందుకుంది. రోడ్డు ప్రక్కన పూలు, పండ్లు కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు అకస్మాత్తుగా కురిసే వర్షాలతో ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనిని గమనించిన అమిత సరకులను తొందరగా సర్దుకోవడానికి వీలుండే విదంగా ఫోల్డేబుల్ చైర్‌ను రూపొందించింది. ఇల్లంతకుంటలోని జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుతన్న ఒడ్నాల రేష్మ అనే విద్యార్థిని గైడ్ టీచర్ మహేష్‌చంద్ర సహకారంతో ఉమెన్ ఆయిట్ అనే ఎగ్జిబిట్‌ను ప్రదర్శించింది. ఇదే పాఠశాలలో చదువుతున్న పడిగె భవిత్ అనే విద్యార్థి గైడ్‌టీచర్ మధుసూదన్‌రావు సహకారంతో రైతు స్నేహపూర్వక సాధనం అనే ప్రాజెక్టును రూపొందించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇల్లంతకుంటలోని కేరళ మోడల్ స్కూల్‌లో చదువుతున్న ఆర్లీన్ అనే విద్యార్థి గైడ్‌టీచర్ బాలకృష్ణ సహకారంతో పరిశ్రమల వ్యర్థాల ఉద్గారాల శుభ్రత అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



అమిత తయారు చేసిన ప్రాజెక్టు

పోగొట్టుకున్న ఫోన్ భక్తుడికి అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఆలయ ఉద్యోగి

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో బస్‌స్టేషన్ సమీపంలో గల శ్రీ లక్ష్మీనరసింహసదన్ ధర్మశాలలో ఒక భక్తుడు పోగొట్టుకున్న సెల్ ఫోన్ దొరికిన ఆలయ ఉద్యోగి, ఇన్‌చార్జి వంశీకృష్ణ ఆదివారం ఆయనకు అప్పగించాడు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన భక్తుడు దైవ దర్శనానికి వచ్చి బస్‌స్టేషన్ సమీపంలో గల లక్ష్మీనరసింహసదన్‌లో బస చేశాడు. ఉదయం తనకు సంబంధించిన 17 వేల రూపాయలు విలువ గల సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆ ఫోన్ దొరికిన ఆలయ ఉద్యోగి, ఇన్‌చార్జి వంశీకృష్ణ వెంటనే ఈవో సంకటాల శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. ఈ మేరకు భక్తుడికి కౌంటర్ వద్దకు పిలిపించి అప్పగించారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల ఆవరణ



మందుబాబులు తాగి పడేసిన సీసాలు

కొడిమ్యాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న మండలంలోని పూడూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. పాఠశాలకు గతంలో నిర్మించిన ప్రహరీగోడను కొంత భాగం గతంలో గుర్తు తెలియని వ్యక్తులు కూలగొట్టారు. దీంతో అక్కడి నుంచి రాత్రి సమయంలో పలువురు వచ్చి పాఠశాల ఆవరణలో మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో బీరు సీసాలు పగులకొడుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు కొనసాగుతున్నాయి. ప్రహరీ గోడ సరిగా లేకపోవడంతో ఏడాది క్రితం అధికారులు ఏర్పాటు చేసిన సోలార్ లైట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారని ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సంబంధిత అధికారులు పట్టించుకొని ప్రహరీ నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



ధర్మపురిలో స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

భక్తజన సంద్రమైన మల్లన్న జాతర



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

గొల్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతర భక్తజన సంద్రమైంది. ఉత్సవాల్లో భాగంగా మొదటి ఆదివారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని, బంతిపూలు మెడలో ధరించి ఒగ్గు పూజారుల ఢమరుకనాదాల నడమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలిలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘు వేదమంత్రోచ్ఛ రణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి రూ. 72010 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. జాతరలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఉత్సవాలను ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ పర్యవేక్షించారు.

- వర్షంతో భక్తుల ఇక్కట్లు..

ఆదివారం జరిగిన జాతర ఉత్సవాల సందర్భంగా మల్లన్న పేటలో అకగంట పాటు ఓ మోస్తరు ఆకాల వర్షం కురిసింది. దీంతో భక్తులు ఇక్కట్ల పాలయ్యారు. ఆలయ పరిసర ప్రదేశాలతో పాటు ఆలయం నలుదిక్కుల పంటపొలాల్లో, ఆరుబయట భక్తులు బస చేయ డంతో ఆకాల వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉత్సవాలకు తల్లిదండ్రులతో కలిసి వచ్చిన ఆకుల హిమాన్ష్ అనే రెండేళ్ల బాలుడు జాతరలో తప్పిపోయాడు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ బాలుడిని వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించాడు.

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో ఆదివారం మల్లన్న భక్తులు స్నానాలు ఆచరించారు. భక్తులు తలపై మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని త్రిశూలం చేత పట్టుకుని ధర్మపురి క్షేత్రానికి తరలివచ్చారు. అనంతరం భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు చేశారు. అలాగే నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇసుక లింగాల వద్ద ఉంచి అత్యంత భక్తి శ్రద్దలతో పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని మెడలో పూల దండ వేసుకుని భక్తి పాటలు పాడుతూ భక్తులు విగ్రహాల పెట్టెలతో తిరుగు ప్రయాణం చేశారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదేల, ఐనవోలు ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకునేందుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది.

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్ర గాయాలు

కోరుట్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగినిపల్లి గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న తేలు మణి అనే విద్యార్థికి విద్యుత్ షాక్ తగిలి తీవ్రగాయాల పాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. తేలు మణి తన స్నేహితులతో కలిసి గ్రామంలో షటిల్ కోర్టు ఏర్పాటు చేసుకున్నారు. సమీపంలో ఉన్న విద్యుత్ సంభం నుంచి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం తన స్నేహితులతో షటిల్ ఆడుతుండగా ప్రమాదవశాత్తూ మణికి విద్యుత్ తీగలు తగిలి షాక్ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే మణిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు చెప్పడంతో హైదరాబాదు తరలించారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం భక్తులు తెల్లవారు జామున ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని, ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం కోసం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. భక్తులు కోడెమొక్కు చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజ చేశారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా పోచమ్మ బోనాలు



అనంతారంలో బోనాలు నిర్వహిస్తున్న మహిళలు

ఇల్లంతకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామంలో ఆదివారం ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయిని ఏర్పాటు చేసి సంవత్సరం కావడంతో బోనాలు నిర్వహించారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను కేంద్రం వెంటనే రద్దు చేయాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కోరుట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీనారే భవనంలో నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలో రాష్ట్ర నాయకులు భాలకృష్ణ, శ్రీకాంత్, సుందర్‌లతో కలిసి పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా పట్టణంలోని జాతీయ రహదారిపై సీపీఎం నాయకులు కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. మొదట సినారే భవనంలో అమరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లాతో పాటు వివిధ జిల్లాలో ప్రజా సమస్యలను గుర్తించి చేయాల్సిన నిరసనలపై చర్చించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మతాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విధానాలను మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తిరుపతి నాయక్, ఎంఏ చౌదరి, ఇందూరి సులోచన, నాయిని శారధ, భగత్, భూషణ్, రమేష్, మల్యాల సురేష్, పద్మ, లక వత్ మహిపాల్ నాయక్, రజియా సుల్తానా, కొంచం శంకర్, గుమ్మడి రమేష్, ఎల్ల పోశయ్య తదితరులు మాట్లాడారు.

చరిత్రకు సాక్ష్యం..

రాయికల్ త్రికూటాలయం

- తగిన ఆదరణ లేక కనుమరుగు
- అభివృద్ధి చేయాలని భక్తుల డిమాండ్

రాయికల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన త్రికూటాలయం తగిన గుర్తింపు లేక ఆలయ చరిత్ర కనుమరుగవుతోంది. గతంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినా పూర్తి స్థాయిలో వాటిని వినియోగించలేదు.



రాయికల్‌లోని త్రికూటాలయం

● ఆలయ చరిత్ర

క్రీ.శ.1305లో కాకతీయ రాజుల పరిపాలనలో చెన్న కేశవనాథ త్రికూటాలయం నిర్మితమైంది. సుమారు ఏడు వందల ఏళ్ల క్రితం రాయికల్‌లో నిర్మించిన ఈ ఆలయంతోనే రాయికల్ చరిత్ర ముడి పడి ఉంది. ఆలయంలో ఉన్న పంచముఖ లింగం ఎంతో విశిష్టమైంది. ఈ ఆలయంలో సూర్యనారాయణ స్వామి, పంచముఖ లింగం, వేంకటేశ్వరస్వామి ముగ్గురూ ఒకే చోట కొలువు దీరడంతో ఆలయానికి త్రికూటాలయం అని పేరు వచ్చింది. ఆలయ అభివృద్ధికి ఏఎస్ఎల్ పార్సిల్ ఎండీ సీహెచ్‌ఎన్‌వి కృష్ణారావు నివేదితా దంపతులు, పట్టణ ప్రజల సహకారంతో ఆలయంలో విగ్రహాల పునప్రతిష్ఠ చేసి ఆలయ ప్రాంగణంలోనే నూతనంగా వినాయక ఆలయం నిర్మించి కొంతవరకు ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. ప్రభుత్వం నుం చి నిధులు లేకపోవడంతో ఆలయం పూ ర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడంలేదు.

● అభివృద్ధికి నిధులు కరువు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించినప్పటికీ ఆలయ మరమ్మతులకు నిధులు లేకపోవడంతో పాటు ఆలయ చరిత్రను కాపాడేవారే కరువయ్యారు. పట్టణంలోని పలువురు నాయకులు ఆలయ విశిష్టత కాపాడుతూ పలు ఉత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు లేకపోవడంతో ఆలయ అభివృద్ధి జరగడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆలయంలోని పంచముఖ లింగం

ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- ఏనుగు మల్లారెడ్డి, రాయికల్



ఏళ్ల చరిత్ర కలిగిన చెన్నకేశవనాథ ఆలయానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి. అత్యంత పురాతన పంచముఖ లింగం అరుదుగా ఉండే ఆలయాల్లో కేశవనాథ ఆలయం ఒకటి. ఆలయ చరిత్రను కాపాడి అభివృద్ధి చేయాలి. పర్యాటక ప్రాంతంగా గుర్తించి నిధులు మంజూరు చేయాలి.

పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి

- తుమ్మల సదాశివరెడ్డి(నాని), రాయికల్.



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చెన్నకేశవనాథ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా చూపించారు. నూతన జిల్లాలోనూ పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి. ఆలయ ప్రాంగణంలో గదులు నిర్మించి అభివృద్ధికి నిధులు విడుదల చేసి ఆలయ చరిత్రను కాపాడాలి.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి నిత్యం ధ్యానం చేస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని తద్వారా శారీరక ఆరోగ్యం సాధించ వచ్చని హిమాలయ యోగి జ్ఞానానంద గిరిస్వామి అన్నారు. ఆదివారం నగరంలోని గీతామందిర్‌లో ఉచిత క్రియ యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మనిషి అనేక ఒత్తిడిలకు గురై అశాంతికి లోనవుతున్నారన్నారు. ప్రతి నిత్యం ధ్యానం చేసినట్లయితే అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చని సూచించారు. అన్నిటికంటే బ్రహ్మజ్ఞానం ముఖ్యమైందన్నారు. దాన్ని ప్రజలకు అందించడం కోసం క్యాంపులను ఉచితంగా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాణయామంతో పాటు ధ్యానంలో మెళకువలను నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్ర మంలో యోగా రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల రమేశ్, గీతామందిర్ ఆశ్రమ నిర్వాహకులు విష్ణు సేవానందస్వామి, భారత స్వాభిమాన్ ముఖ్య సంరక్షకులు బివి రావు, శిష్యులు భాస్కర్‌రావు, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జ్ఞానానందగిరి స్వామి, హాజరైన యోగా సాధకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్ బైపాస్ రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వాజిద్(18) అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని దొంగలుగా గ్రామానికి చెందిన వాజిద్ ఈ ప్రమాదంలో మృతి చెందాడు. వాజిద్ అతని సోదరుడు సాజిద్ ఆరు సంవత్సరాల నుంచి హౌసింగ్ బోర్డు కాలనీలోని అతని బంధువు ఇంటి వద్ద ఉంటూ ఒక టైర్ పంక్షన్ షాపులో పని చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం షాప్ మూసివేసి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లేందుకు వీ కన్వెన్షన్ ఎదురుగా రోడ్డుపై నిలుచున్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి పెద్దపల్లి ఫ్లైఓవర్‌వైపు వెళ్తున్న ఒక కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాజిద్ తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా షేక్ సాహిత్‌కు పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ ఘటనకు ముందే అదే రోడ్డులో సయ్యద్ ఆఫిక్ అనే వ్యక్తిని కూడా కారు ఢీ కొట్టినట్లు మృతుడి సోదరుడు సాజిత్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అతివేగంగా నిర్లక్ష్యంగా కారు నడిపి ఒకరి మృతికి ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటనకు కారణమైన నూరుద్దీన్ ఖాదిరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి(60) మృతి చెందాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. ఉదయం అపస్మారకపరిస్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి మరణించినట్లుగా నిర్ధారించారని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యురీలో భద్రపరి చామన్నారు. మృతుడిని గుర్తించినవారు ఒకటో టౌన్ సీఐ 8712670761, 9908440822లో సమాచారాన్ని అందించాలని కోరారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని 24వ డివిజన్ అంబేద్కర్ రిజర్వాయర్ సమీపంలోని కూడలిలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో డివిజన్ నాయకుడు తుంగ బాబురావు, అసెంబ్లీ నియోజకవర్గ మాజీ ఇంచార్జి కల్యాడపు ఆగయ్య పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ ఎప్పుడో..?

కరీంనగర్ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ముందు జంక్షన్ సుందరీకరణలో భాగంగా తొలగించిన తెలంగాణ తల్లి విగ్రహఆవిష్కరణకు మోక్షమెప్పుడు కలుగుతుందో అని పలువురు తెలంగాణ వాదులు ప్రశ్నిస్తున్నారు. మూడేళ్ల కిత్రం ఆ జంక్షన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహాన్ని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. జంక్షన్ పనులు పూర్తయిన వెంటనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ఆనాటి మున్సిపల్ అధికారులు ప్రకటించారు. అయితే ఆ విగ్రహం ఎక్కడ పెట్టారో... ఎందుకు ఆవిష్కరించడం లేదంటూ డివిజన్ కార్పొరేటర్ కమలజిత్ కౌర్ సోహెన్‌సింగ్ పలుమార్లు అధికారులను ప్రశ్నించినా ఆ విగ్రహం ఆచూకీ చూపడం లేదు. జూలైలో మళ్లీ వన్‌టౌన్ జంక్షన్ ముందే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. అయితే ఇప్పటికీ ఆ విగ్రహాన్ని ఆవిష్కరించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 9న హైదరాబాద్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసి, స్వరాష్ట్ర ఏర్పాటులో కీలకభూమి పోషించిన కరీంనగర్‌లో మాత్రం తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటును ఎవరూ పట్టించుకోవడం లేదని తెలంగాణ వాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని వారు కోరుతున్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అరవై ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు సుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉదయం పదిన్నర గంటలకు ఇందిరాచౌక్ వద్ద నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్ నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతులో భాగంగా సోమవారం ఉదయం పది గంటల నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ ఏం లావణ్య తెలిపారు. శివ థియేటర్ ప్రాంతం, కెమిస్ట్ భవన్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఐబీ చౌరస్తా ప్రాంతం, సర్కస్ గ్రౌండ్ ఏరియాలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

భగత్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పట్టణం ఎనిమిదో వార్డుకు చెందిన వాసాల జనార్దన్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీఆర్‌ఎస్ నాయకుడు ఎస్‌కె బాబా ఆదివారం అందించారు. ఆర్థో సమస్యతో చికిత్స పొందిన ఆయనకు మాజీ మంత్రి గంగుల కమలాకర్ సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన 29,500 రూపాయల చెక్కును అందించారు.

సినారె కవితా పురస్కారానికి సంపుటాల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాహితీ గౌతమి ప్రతీ యేటా అందజేస్తున్న సినారె కవితా పురస్కారం-2022కు గాను రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు పురస్కార కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు నంది శ్రీనివాస్, కొత్త అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కవుల కవితా సంపుటాలను పోటీ కోసం 4ప్రతులను ఈనెల 25లోగా డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి, శివానంద ఆసుపత్రి, ఇంటి నెంబరు 3-3-181, నవరన్ స్ట్రీట్, కరీంనగర్, 505001 చిరునామాకు పంపాలని కోరారు. మిగతా వివరాలకు 9490401861, 9395553393 నెంబర్లలో సంప్రదిం చాలని తెలిపారు. గతంలో ఈ పురస్కారం పొందిన కవులకు అవకాశం లేదని, దీర్ఘ కవితలు, గేయాలు, నానీల ప్రక్రియల్లో ప్రచురించిన వాటిని పోటీలకు స్వీకరించబడవని పేర్కొన్నారు.

కవితల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహితి 10 వసంతాల సందర్భంగా విద్యార్థులు, విద్యావంతులు, కవులు, మేధావులు, ఉపాధ్యాయుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వ్యాసాలు-కవితలను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి మానువాడ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాస రచనకు గాను 'నేటి సమాజానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భావ జాల ఆవశ్యకత (10 పేజీలకు మించకుండా), కవితలకు గాను 'నేటి సమకాలీన అంశాలు' (25 పంక్తులు మించకుండా) రాసి పీడీఎఫ్ రూపంలో గాని, పోస్టు ద్వారా గాని ఈ నెల 20 వరకు మాడుగుల రాములు, ఇంటి నెం. 6-6-279, శర్మనగర్, కరీంనగర్, 505001 చిరునామాకు, లేదా 9701189242, 9441596550, 900083024 నెంబర్లకు పంపాలని కోరారు. ఎంపిక చేసిన వ్యాసాలు, కవితలను సంకలనంగా తీసుకువస్తామని పేర్కొన్నారు.

వాస్తవికతకు ప్రతిబింబం మల్లయ్య రచనలు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక వాస్తవికతకు ప్రతిబింబంలాగా డాక్టర్ కాలువ మల్లయ్య రచనలు ఉంటాయని భారత అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి వేల్పుల నారాయణ అన్నారు. సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌నగర్ భగవతి హైస్కూల్‌లో సాహితీవేత్త డాక్టర్ కాలువ మల్లయ్య రచించిన మూడు పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. 'మంచి అన్నది మాల అయితే' నవలను వేల్పుల నారాయణ, 'పదహారు గంటల యాదిలో మనః పరిభ్రమణం' నవలను పివి సంతోష్‌బాబు, తెలంగాణ దేశీ భాషా సాహిత్య వ్యాసాల 'గంప' పుస్తకాన్ని బొద్దుల లక్ష్మయ్య ఆవిష్కరించారు. కూకట్ల తిరుపతి, సంకేపల్లి నాగేంద్రశర్మ, బూర్ల వేంకటేశ్వర్లు పుస్తకాలను పరిచయం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గులాబీల మల్లారెడ్డి, బొద్దుల లక్ష్మణ్, శంకరయ్య పాల్గొన్నారు.

ఇంటి పంటతో ఆరోగ్యం


కూరగాయల మొక్కలను అందజేస్తున్న హార్టికల్చర్ అధికారి రోహిత్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఇంటి పంటలతో ఆరోగ్యంగా ఉండవచ్చని చొప్పదండి క్లస్టర్ హార్టికల్చర్ అధికారి సీహెచ్ రోహిత్ అన్నారు. కరీంనగరంలోని విద్యానగర్‌లో ఆదివారం జరిగిన సీటీజీ (సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్) సమావేశానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. రసాయనాలతో పండించిన ఆహార ఉత్పత్తులు విషతుల్యంగా మారుతున్నాయని ఆయన అన్నారు. క్యాన్సర్ వ్యాధి బారిన పడటానికి ఆ ఆహారం ప్రధాన కారణమని వివరించారు. ప్రతిఒక్కరూ తమ ఇంటిలో రసాయన రహిత ఉత్పత్తులను పండించుకోవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. రవీందర్ హోస్ట్‌గా నిర్వహించిన ఈ సమావేశానికి స్వాతి మధు అధ్యక్షత వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా టెర్రస్ గార్డెన్స్ నిర్వహిస్తున్న పలువురు సమావేశానికి హాజరై తమ అనుభవాలను తోటి సభ్యులతో పంచుకున్నారు. కూరగాయల మొక్కలు, విత్తనాలు అలంకరణ మొక్కలు పరస్పరం పంచుకున్నారు.

ముగిసిన శతచండీయాగం


యాగంలో పాల్గొన్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి దంపతులు

భగత్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న శతచండీ మహాయాగం ఆదివారంతో ముగిసింది. ఆధ్యాత్మిక గురువు సద్గురు శ్రీ విశ్వయోగి శ్రీవిశ్వంజి మహారాజ్ పూర్ణాహుతి కార్యక్రమంలో మాట్లాడుతూ భక్తులకు అన్ని రకాలుగా వరాలు ఇచ్చే తల్లి చండీమాత అన్నారు. ప్రతి ఒక్కరు ప్రేమ, ఆప్యాయతను పెంపొందించుకోవాలన్నారు. నేటి సమాజంలో సమయాభావంతో చాలా మంది ఆధ్యాత్మిక చింతనను పొందలేకపోతున్నారన్నారు. కరీంనగర్ జిల్లా ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేంద్ర బిందువన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ చండీ మహాయాగాన్ని నిర్వహించడం అమ్మవారు ప్రసాదించిన వరమన్నారు. అల్ఫోర్స్‌లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందిస్తు ఆధ్యాత్మికత వైపు పయనించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గర్రపల్లి మహేశ్వరశర్మ పాల్గొన్నారు.

మహంకాళిమాత విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్

కరీంనగర్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో బీరయ్య కామరావతి, మహంకాళిమాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఆదివారం విగ్రహాలను డోలు వాయిద్యాలతో, కోలాటాలతో ఊరేగింపుగా మండపం వద్దకు తీసుకువెళ్లారు. సాయంత్రం గణపతి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, మాజీ సర్పంచ్ పురుమల్ల లలిత శ్రీనివాస్, ఒగ్గు కళాకారులు సాయిల్ల శివయ్య, కుల సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'స్మరించుకుందాం' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కాశ్మీరగడ్డలోని ఐఎంఎ హాల్లో వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ నేతృత్వంలో వెలువడిన నూరవ పుస్తకం 'స్మరించుకుందాం' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఉదయం, మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో పుస్తకావిష్కరణ, కవులు, రచయితలకు అవార్డుల ప్రదానం జరిగింది. కవి, నటుడు, ఆంధ్రప్రదేశ్ నంది పురస్కార గ్రహీత సాదనాల వేంకటస్వామి నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవి, సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తకం మనలో స్ఫూర్తి నింపుతుందని, ప్రగతికి బాటలు వేస్తుందని అన్నారు. సాహితీవేత్త, అవధాని డాక్టర్ గండ్ర లక్ష్మణరావు మాట్లాడుతూ తమ సంకలనాల ద్వారా ఎంతో మంది కొత్త రచయితల్ని సాహిత్య రంగానికి పరిచయం చేశారని అభినందించారు. పుస్తకాన్ని పాణ్యం దత్తశర్మ పరిచయం చేశారు. వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన నాగమల్ల పున్నం చందర్ రాసిన త్రిపద చూర్ణం, విజయశ్రీ రాసిన అమృత పద కుసుమాలు పుస్తకాలను సాదనాల వేంకటస్వామి నాయుడు, మౌనశ్రీ మల్లిక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్తంభంకాడి గంగాధర్ సమన్వయ కర్తగా వ్యవహరించగా పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

దీక్షలకు అధిక సంఖ్యలో తరలిరావాలి

గంగాధర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నుంచి తలపెట్టిన దీక్షలకు జిల్లాలోని మాజీ సర్పంచ్‌లు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతంచేయాలని మాజీ సర్పంచ్‌ల జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం కోరారు. గంగాధరలో ఆదివారం ఆయన ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు బాకీలు తెచ్చి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. బిల్లులు చెల్లిస్తామని తెలుపగానే సర్పంచ్‌లందరు తెలిసిన వారి వద్ద బాకీలు తీసుకువచ్చి పనులుచేయించారు. లక్షల కొద్ది బిల్లులు పెండింగ్‌లో ఉండి వడ్డీలు కట్టలేక పలువురు సర్పంచ్‌లు ఆత్మ హత్యలు చేసుకున్నారని వాపోయారు. ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞపి చేసిన స్పందన లేకపోవడంతో దీక్షలు చేపడుతున్నామని తెలిపారు. సోమవారం నుంచి ఈనెల 14 వరకు దీక్షలు కలెక్టరేట్ వద్ద చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. దీక్షలకు సర్పంచ్‌లందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

హుజూరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గుట్టల్లో నుంచి అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. హుజూరాబాద్ పట్టణ శివారులోని పాండవుల గుట్ట నుంచి ఆదివారం అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే ఫిర్యాదు మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవు రోజుల్లో రాత్రి వేళల్లో మట్టిని తరలిస్తే ఎక్స్‌క వేటర్లు, టిప్పర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మట్టి తరలిస్తున్న అక్రమార్కులపై కేసులు నమోదు చేశామని, శనివారం అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కొండపల్కలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మానకొండూర్/ఇల్లందకుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మరువలేనిది పాఠశాల స్మృతులని పాఠశాల పూర్వ విద్యార్థులు రుజువు చేశారు. జ్ఞాపకాల దొంతరులు చెరిపిస్తే చెరిగిపోయేవి కావని చాటిచెప్పారు. గత స్మృతులను మనసులో పదిలపర్చుకోవాలన్న వారి ఆశలను, ఆకాంక్షలను ఎట్టకేలకు నెరవేర్చుకున్నారు. ఆదివారం తాము చదివిన పాఠశాలల్లో కలుసుకుని ఆనాడు తమకు పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు.


ఇల్లందకుంట మండలం సిరిసేడులో 2003-04 పదో తరగతి విద్యార్థులు

తాత్కాలిక భవనంలో పంచాయతీ కార్యాలయం

- సమావేశాలు, గ్రామసభలకు ఇబ్బందులు - పక్కా భవనం నిర్మించాలని ప్రజల వినతి

వీణవంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలంలో మేజర్ గ్రామపంచాయతీ అయిన చల్లూరు గ్రామంలో పంచాయతీ కార్యాలయం తాత్కాలిక భవనంలో కొనసాగిస్తున్నారు. గ్రామంలో సుమారు ఐదువేల జనాభా ఉంది. గతంలో ఉన్న భవనం కూల్చి వేసి కొత్తది నిర్మించాలని పదేళ్ల క్రితం అధికారులు, నాయకులు నిర్ణయించారు. దీని కోసం ప్రభుత్వం నిధులు సైతం మంజూరు చేసింది. గ్రామంలో ఆలయానికి సంబంధించిన భూమిలో భవన నిర్మాణం చేపట్టేందుకు అప్పటి పాలకవర్గం యత్నించింది. కాగా గ్రామానికి చెందిన కొందరు ఆలయానికి సంబంధించిన భూమిలో భవనం చేపట్టకూడదని కేసు వేశారు. అటు ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతి రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో గ్రామంలోని యూత్ క్లబ్ భవనంలో తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. ఆ భవనంలో కేవలం ఒక్క గది మాత్రమే ఉండడంతో సమావేశాలు, గ్రామసభల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు.

- సమీపిస్తున్న స్థానిక ఎన్నికలు..

త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గ్రామంలో పంచాయతీలు ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను సిద్ధం చేయడం, ఎన్నికల నిర్వహణపై సమీక్షలు వంటివి నిర్వహించేందుకు కార్యాలయంలో స్థలం లేకపోవడంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఆయా సేవలు పొందేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు పంచాయతీ భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


యూత్‌క్లబ్ భవనంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

చిగురుమామిడి, డిసెంబరు 8: మండలంలోని నవాబుపేటలో ఇటీవల మృతి చెందిన వారిని కుటుంబాలను ఆదివారం రెడ్డిసంఘం నాయకకులు పరామర్శించారు. గ్రామానికి చెందిన మండల రెడ్డి ఐక్య వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ కాంతల మహిపాల్‌రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఇదే గ్రామానికి చెందిన రెడ్డి సంఘం నాయకుడు కూతురు శ్రీపతిరెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం వారి కుటుంబ సభ్యులను జిల్లా రెడ్డి ఐక్య వేదిక ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మండల రెడ్డి ఐక్య వేదిక గౌరవ అధ్యక్షుడు వంటకాల సంపత్‌రెడ్డి, మండల రెడ్డిఐక్య వేదిక అధ్య క్షుడు కాటం సంపత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి కొండారెడ్డి, సంధిరెడ్డి రాజిరెడ్డి, కూతురు సంపత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నందికొండ మల్లారెడ్డి, జంగా రాజిరెడ్డి, కాంతల రాజిరెడ్డి ఉన్నారు.

ఎరుకుల హక్కుల పోరాట సమితి మండల కమిటీ

రామడుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎరుకుల హక్కుల పోరాట సమితి రామడుగు మండల కమిటీని ఆదివారం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మానుపాటి రవి, ఉపాధ్యక్షుడు బిజిలి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి బిజిలి శ్యామ్ సమక్షంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మానుపాటి సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మానుపాటి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా మనపాటి లచ్చయ్య, మా నుపాటి స్వామి, కట్ట బుచ్చయ్య ఎన్నికయ్యారు. కోశాధికారిగా మానుపాటి సుధాకర్, సహాయ కార్యదర్శులుగా మాన పాటి శేఖర్, మొగిళి శ్రీను, లోకిన వెంక టేష్, గౌరవ అధ్యక్షులుగా మానుపాటి లచ్చయ్య, మానుపాటి మల్లేశం, మాను పాటి సత్తయ్య నియామకమయ్యారు.

పాఠశాలకు అవార్డు

హుజూరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని వివేకవర్ధిని పాఠశాలకు ట్రాయిబ్లేజీ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని హైటెక్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో బ్రెయిన్ ఫీడ్ సంస్థ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 30ఏళ్లుగా విద్యారంగంలో ఎనలేని కృషి చేస్తున్న వివేకవర్ధిని పాఠశాల కరస్పాండెంట్ ప్రసార్ ట్రాయిబ్లేజీ అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు.

తెలంగాణ హాకీ జట్టు మేనేజర్‌గా చిరుత శ్రీనివాస్


శ్రీనివాస్

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెల్పూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పీడీగా పని చేస్తున్న చిరుత శ్రీనివాస్ తెలంగాణ హాకీ జట్టుకు మేనేజర్‌గా ఎంపికైనట్లు పాఠశాల హెచ్ ఎం అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని మండసూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు మేనేజర్‌గా ఎంపిక కావడం అభినందనీయమని కొనియాడారు.

మున్నూరు కాపు సంఘం గ్రామ కార్యవర్గం

మానకొండూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బైరిశెట్టి వెంకటరమణ, అధ్యక్షుడిగా బొమ్మెల్ల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రవీందర్, ఉపాధ్యక్షుడిగా ఆకుల రాజు, కోశాధికారిగా కొట్టె వేణు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా కొడారి సత్యం, కార్యవర్గ సభ్యులుగా పెంచాల లక్ష్మీనారాయణ, రేశ్న చిన్న మల్లయ్య, దొగ్గలి శ్రీనివాస్, గడ్డం సంపత్, కొట్టె నరేష్, గోశెట్టి సత్యనారాయణ, కన్నెబత్తుల రాము, ర్యాకం భాస్కర్, మామిడి రవీందర్, బండారు సంపత్‌ను ఎన్నుకున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట

తిమ్మాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ నియోజకవర్గ అభివృద్ధికి తన ఏడాది పాలనలో పెద్దపీట వేశామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి వివిధ శాఖల ద్వారా 360 కోట్ల 2లక్షల 80 వేల రూపాయల నిధులను మంజూరు చేయించామని పేర్కొన్నారు. మానకొండూర్ నియోజకవర్గం పరిధితో పాటు, ఇతర మండలాలకు చెందిన వారికి 3కోట్ల 6లక్షల 5వేల రూపాయలు ఎల్‌వోసీగా అందజేశామని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నియోజకర్గానికి 7కోట్ల 30లక్షల 88వేల రూపాయల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇతర మండలాలకు చెందిన వారికి కూడా 1,20,54,000రూపాయలు మంజురు చేయించినట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి - షాదీముబారక్ కింది 5కోట్ల 37 లక్షల 62 వేల 292 రూపాయలు లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. వీటితో పాటు ఇతర నిధులు 123 కోట్ల 11లక్షల 60వేలు మంజురైనట్లు పేర్కొన్నారు. తిమ్మాపూర్ మండలం యాదవులపల్లి గ్రామంలో తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ నిర్మాణం కోసం 220 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం మంజురు చేసిందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు సంబంధించి 81 కాంపోనెంట్స్‌కు 79,26,000 రూపాయలు, 58 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 37,40,028 రూ పాయలు మంజురు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న వెలమ సంఘం నాయకులు

వీణవంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెలమ సామాజిక వర్గాన్ని కించపరుస్తూ మాట్లాడిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వెలమ సంఘం నాయకులు కోరారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో ఆదివారం పలువురు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెలమ సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలకు చేసిన ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల వెలమ సంఘం నాయకులు పాపారావు, గొట్టె ముక్కుల రవీందర్‌రావు, కొక్కిరాల సంపత్‌రావు, వీరమనేని సంపత్‌రావు, తక్కళ్లపల్లి సంపత్‌రావు, రాజేశ్వర్‌రావు, వేణుగోపాల్‌రావు, ఆగరావు, రంగారావు, యుగేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.